## 13

# పోరును గెలిచింది ఎక్కడ

*“అంతట యేసు (తన శిష్యులతోకూడ) గెత్సేమనే అనబడిన చోటికి వచ్చి ... పేతురును జెబెదయి యిద్దరు కుమారులను వెంటబెట్టుకొని పోయి, దుఃఖపడు టకును చింతాక్రాంతుడగుటకును మొదలు పెట్టెను. అప్పుడు యేసు – మరణమగు నంతగా నా ప్రాణము బహు దుఃఖములో మునిగియున్నది; మీరు ఇక్కడ నిలిచి, నాతోకూడ మెలకువగా నుండుడని వారితో చెప్పి, కొంతదూరము వెళ్లి, సాగిలపడి – నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నాయొద్దనుండి తొలగిపోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్త ప్రకారమే కానిమ్మని ప్రార్థించెను. ఆయన మరల శిష్యులయొద్దకు వచ్చి, వారు నిద్రించుటచూచి – ఒక గడియయైనను నాతోకూడ మేల్కొనియుండలేరా? మీరు శోధనలో ప్రవేశించకుండునట్లు మెలకువగా ఉండి ప్రార్థనచేయుడి; ఆత్మ సిద్ధమే గాని శరీరము బలహీనమని పేతురుతో చెప్పి, మరల రెండవమారు వెళ్లి – నా తండ్రీ, నేను దీనిని త్రాగితేనే గాని యిది నాయొద్దనుండి తొలగిపోవుట సాధ్యముకాని యెడల, నీచిత్తమే సిద్ధించు గాక అని ప్రార్థించి తిరిగి వచ్చి, వారు మరల నిద్రించుట చూచెను; ఏలయనగా వారి కన్నులు భారముగా ఉండెను. ఆయన వారిని మరల విడిచి వెళ్లి, ఆ మాటలే చెప్పుచు మూడవమారు ప్రార్థనచేసెను. అప్పుడాయన తన శిష్యులయొద్దకు వచ్చి – ఇక నిద్రపోయి అలసట తీర్చుకొనుడి; ఇదిగో ఆ గడియవచ్చియున్నది; మనుష్యకుమారుడు పాపులచేతికి అప్పగింపబడుచున్నాడు; లెండి వెళ్లుదము; ఇదిగో నన్ను అప్పగించువాడు సమీపించియున్నాడని వారితో చెప్పెను” (మత్తయి 26:36–46).*

దేవుని సైన్యానికిని అపవాది సైన్యానికిని మధ్య జరిగే ఆత్మసంబంధమైన పోరుతో దిన జీవితము కూడియుంది. విశ్వాస సంబంధమైన మంచిపోరాటము జరిపేవారికి, యుద్ధములో జయమొందేలా కావలసిన ఆయుధ సామాగ్రియంతా ప్రభువు క్రైస్తవునికి ప్రసాదిస్తాడు. ఎఫెసులోని సంఘానికి ముగింపులో పౌలు యిలా వ్రాశాడు, “అందుచేతను మీరు ఆపద్దినమందు వారిని ఎదిరించుటకును, సమస్తమును నెరవేర్చినవారై నిలువ బడుటకును శక్తిమంతులగునట్లు, దేవుడిచ్చు సర్వాంగ కవచమును ధరించుకొనుడి” (ఎఫెసీ. 6:13). అక్కడనుండి క్రీస్తు సైనికునియొక్క ఆత్మసంబంధమైన యుద్ధోపకరణములన్నిటిని వర్ణించడానికి పౌలు ముందుకు సాగాడు. ఈ యుద్ధ సామాగ్రియంతటిని గూర్చి వివరించిన వెంటనే, క్రీస్తు యొక్క సైనికులను పౌలు యిలా హెచ్చరించాడు, “ఆత్మవలన ప్రతి సమయమునందును ప్రతి విధమైన ప్రార్థనను విజ్ఞాపనను చేయుచు, ఆ విషయమై సమస్త పరిశుద్ధుల నిమిత్తమును పూర్ణమైన పట్టుదలతో విజ్ఞాపనచేయుచు మెలకువగా ఉండుడి” (ఎఫెసీ. 6:18).

ఇంతకు పోరును గెలిచిందెక్కడ? అది మన మోకాళ్లమీదనే! మంచిపోరాటం పోరాడడానికి అవసరమైన సమస్త యుద్ధోపకరణలతో దేవుడు మనకు ప్రసాదించేది

వాస్తవమే అయినా, యుద్ధాన్ని గెలిచేది మాత్రం ఆయన బలమును బట్టి మాత్రమే (ఎఫెసీ. 6:10). ప్రభువు యొక్క భూ నివాసకాలంలో చివరి భాగమందు ఆయన పోరాడిన గొప్ప యుద్ధాన్ని గూర్చి ఈ పాఠంలో మనం కేంద్రీకరిద్దాం. మనకొరకు ఆ పోరాటం మత్తయి 26:36-46లతో రికార్డుచేయబడింది.

క్రైస్తవ సైనికులందరు తమ జీవితాలలో పోరాడవలసిన యుద్ధాలున్నాయి. ఈ యుద్ధాలు అనేక రకములైన రూపాల్లో వస్తాయి. కొన్నిసార్లు పెద్ద నిర్ణయం చేసే రూపంలో మనం పోరాడవలసియుండవచ్చు. కొన్నిసార్లు అది బలమైన శోధనరూపంలో రావచ్చు, అది మార్చుతగిందిగా ప్రభువు భావించే వరకు కొన్నిసార్లు బహుగా అయిష్టమైన పరిస్థితిని మనం సహింపవలసిన రూపంలో యుద్ధంకొనసాగవచ్చు. ఆ పోరు ఎలాటిదైనా సరే, మన దైనిక జీవితానికి సంబంధించిన విషయాలతో కూడినదై ఉంటుంది. అలా వచ్చినప్పుడు ఈ యుద్ధాలలో మనం ఎలా సజీవంగా ఉండాలి? ఆయన భూ నివాస కాలంలోని ఒకే గొప్ప రణరంగంలో ప్రభువు ఆ యుద్ధాన్ని ఎలా జయించాడో లేఖనాల్లో ఒక చిన్న దృశ్యాన్ని చూద్దాం. ప్రభువు పోరాడిన వాటిలోని మహా గొప్ప యుద్ధం సిలువపై జరిగించిందని మనం అనుకొంటాం. కాని వాస్తవం అదికాదు. తన మహా గొప్ప బలిని ప్రభువు సమర్పించింది సిలువమీదనే గాని, ఆలాటి బలి లేక అర్పణ చేయడానికి అసరమైన బలాన్ని ఆయన పొందింది గెత్సేమనే తోటలో మోకాళ్ల మీదనే! ఈ గొప్ప పోరాటాన్ని మనం చూస్తుండగా, మనం ఎదుర్కొనే విజయాన్ని సాధించే యుద్ధాలకు వెనుక దాగియున్న నిజమైన మూలాన్ని మనం కనుగొనలం.

## పోరాటం యొక్క చోట్లు: ఆ తోట

ఒలీవల కొండలోని గెత్సేమనే తోటలో ప్రభువు యొక్క అతి గొప్ప పోరాటం జరిగింది. ప్రభువైన యేసును గూర్చియు ఆయన ప్రార్థనా జీవితమును గూర్చియు లూకా 22:39లో బహు విశేషమైన సంగతిని మనం నేర్చుకుంటాం. “తరువాత ఆయన బయలుదేరి, తన వాడుక చొప్పున ఒలీవలకొండకు వెళ్లగా ...” “తన వాడుక చొప్పున” అనే ప్రయోగం మన ప్రభువు యొక్క ప్రార్థనా జీవితాన్ని గూర్చి ఎంతో తెలుపుతోంది, తాను అప్పగింపబడిన రాత్రి మాత్రమే ఆ గెత్సేమనే తోటలో ప్రభువు ప్రార్థించలేదుగాని, ఒలీవల కొండమీద తన తండ్రితో ఆయన కలిసికొనడానికి వాడుక చేసికొన్నాడు. అక్కడ ప్రభువైన యేసు పరలోకపు తండ్రితో మాటిమాటికి కలిసికొంటూ ఉండేవాడు.

లూకా 21:37యిలా అంటుంది, “ఆయన ప్రతిదినము పగటియందు దేవాలయములో బోధించుచు రాత్రివేళ ఒలీవలకొండకు వెళ్లుచు కాలము గడుపు చుండెను.” అనేక సమయాలలో రాత్రియంతయు ఒంటరిగా తన తండ్రితో ఆయన గడు పుతూ ఉండేవాడు. పగటి పూట ఆయన జనులతో గడుపుతూ, వారికి బోధించుతూ, వారిలోని రోగులను స్వస్థపరచుతూ తన తండ్రి చిత్తం జరిగిస్తూ ఉండేవాడు, కాని రాత్రులయందు తన మోకాళ్లమీద – తండ్రివైపు తేరిచూస్తూ, ప్రార్థనలయందు

ఆయనను వీక్షించుతూ, తన హృదయాన్ని ఆయన యెదుట కుమ్మరించుతూ, ఆయననుండి ఆత్మ సంబంధమైన బలమును పొందుతూ ఉండేవాడు. తండ్రితోకూడా ఆ గడియలు ప్రభువు గడిపిన కారణాన, దైనిక శోధనలను ఎదిరించగల బలము ఆయన కలిగియున్నాడు.

ఆయన అప్పగింపబడబోయే దినపు సాయంత్రపు వేళ, తన శిష్యులతోకూడా ప్రభువు పస్కా భోజనాన్ని ఆచరించాడు. ఆ రాత్రిలో ఏమి సంభవించనుందో ఆ శిష్యులు ఎరుగరుగాని, ప్రభువు ఎరుగును. తాను అప్పగింపబడబోతాడని చివరి వచనంలో ఆయన ప్రకటించాడు, తన శిష్యులు బహుగా బాధపడ్డారు. ప్రభువు అనుభవించనైయున్న వేదన ఆయన ఎరుగును. అయినా, ప్రభువు అనుభవించిన వేదనతో తన శిష్యుల ఆవేదన ఎంత మాత్రము పోల్చదగినది కాదు. తన తండ్రి యొక్క సింహాసనము ఎదుట ఆయన తీక్షణంగా ప్రార్థనలో గడిపిన సమయంలోని, విశ్రాంతిగాక తన వేదనకు మరేదీ లేదన్న సంగతిని ప్రభువు ఎరుగు. ఇది మనస్సునందుంచుకొని, పస్కా భోజనమునుండి గెత్సేమనే వనమునకు ఆయన తన శిష్యులను నడిపించాడు. ప్రభువు తోటలోనికి వచ్చేసరికి, ఆయన శిష్యులలో తక్కిన ఎనిమిదిమందిని కూర్చుండి ప్రార్థన చేయాలని నిర్దేశించాడు. ముగ్గురు శిష్యులను తనతో కూడా తోటలోపలికి తీసుకొని వెళ్లాడు. అక్కడ ఆయన దుఃఖపడుటకును చింతాక్రాంతుడగుటకును మొదలు పెట్టినట్టు మత్తయి 26:37 తెలుపుతుంది. మన ప్రభువు యొక్క మానవత్వము ఈ మాటలు మనకు జ్ఞాపకం చేస్తున్నాయి! యేసు శరీరమందున్న కుమారుడగు దేవుడైయున్నా, ఆయన నరుడు కూడా; నరుడుగా ఆయన మనవలె అన్ని విధములుగా శోధింపబడ్డాడు (హెబ్రీ. 4:15). ఆయన ఒత్తిడితోను, దుఃఖముతోను, వేదనతోను, గాయపరచబడడంతోను అనుభవం కలిగినవాడై ఉన్నాడు! హృదయంలోను, మనస్సులోను బహుగా బాధింప బడియున్నను, ప్రభువు, "కొంతదూరము వెళ్లి, సాగిలపడి" ప్రార్థించాడు (39 వ.).

ప్రార్థనయందు తండ్రికి తన హృదయాన్ని ప్రభువు కుమ్మరించిన ఒక ప్రియమైన స్థలము ఆయనకుండేది, తన తండ్రితో ఆయన తరచుగా కలిసికొనేది ఎక్కడో ఇస్కరియోతు యూదాకు బాగా తెలుసు. ఒకరితో ఒకరు, నీకు ఎదురయ్యే సమస్యలతో పోరాడడానికి, తండ్రిని కలిసికొనే ప్రత్యేకమైన చోటు ఏదైనా నీకు ఉందా?

"There's a Garden," "అనే పాటలో" ప్రభువు మనలను కలిసికొనడానికి అపేక్షించే ప్రత్యేకమైన ప్రార్థనా స్థలాన్ని "ఆ తోట" అనేది సూచిస్తుంది:

> యేసు వేచియుండే తోట యొకటి కలదు,
> ఆ స్థలము అద్భుతంగా రమ్యమైయుంది;
> ఆయన ప్రసన్నత యొక్క వెలుగుతో అది ప్రకాశిస్తుంది:
> అది అందమైన ప్రార్థనా వనము.
> ఓ అందమైన వనము, ప్రార్థనా వనము,
> ఓ ప్రార్థనయొక్క అందమైన వనము
> అక్కడ నా రక్షకుడు వేచియుండి, ఆయన ద్వారము తెరుస్తాడు

అందమైన ప్రార్థనా వనమునకు.[1]

తమ్మును తాము క్రమపరచుకొని ఆయనతోకూడా ప్రశస్తమైన సమయాన్ని గడపగల వారికి మాత్రమే ఆ "వనము" యొక్క నిజమైన ఆనందమును అందమును ఎప్పుడైనా తెలియవస్తుంది.

"దేవునియొద్దకు రండి, అప్పుడాయన మీయొద్దకు వచ్చును" యాకోబు మనకు అభయమిచ్చాడు (యాకోబు 4:8). తన పిల్లలైన వారికి అది దేవుని వాగ్దానమైయుంది. మనం దేవునికి ఎంత సమీపంగా ఉండాలో అంత సమీపంగా ఉండనట్లయితే, ఆ తప్పు మనదేగాని అయనది మాత్రం కాదు. మనం వినయంగా ప్రభువుతో కాలం గడపడానికి యిష్టపడుతున్నామా?

## పోరాటము యొక్క అంశము: ఈ "గిన్నె"

ప్రభువు యిలా ప్రార్థించాడు, "-నా తండ్రీ, సాధ్యమైతే ఈ గిన్నె నా యొద్దనుండి తొలిగి పోనిమ్ము, అయినను నా యిష్టప్రకారము కాదు నీ చిత్తప్రకారమే కానిమ్ము" (39 వ.).

ఆ తోటలో ప్రభువు "ఈ గిన్నె"యని దేనిని గూర్చి ప్రార్థిస్తున్నాడు? కీర్తన. 75:8లో దేవుని ఉగ్రత పాత్రయని కీర్తన రచయిత మాట్లాడాడు: "యెహోవా చేతిలో ఒక పాత్ర యున్నది అందులోని ద్రాక్షారసము పొంగుచున్నది, అది సంబారముతో నిండియున్నది, ఆయన దానిలోనిది పోయుచున్నాడు భూమిమీదనున్న భక్తిహీనులందరు మడ్డితోకూడ దానిని పీల్చి మ్రింగివేయవలెను." క్రూరమృగమును సేవించువారు తమ నొసళ్లయందు ముద్ర పొందుతారని యోహాను ప్రకటన 14:9, 10లో ప్రస్తావించినప్పుడు తెలుపబడిన పాత్రయే కీర్తన లేఖకుడు వర్ణించిన పాత్ర; మరియు "ఏమియు కలుపబడకుండ దేవుని ఉగ్రత పాత్రలో పోయబడిన దేవుని కోపమను మద్యమును వాడు త్రాగును."

ప్రభువు ప్రార్థించిన పాత్ర దేవుని కోపమను మద్యపు పాత్రయే. పాపము పట్ల దేవుని న్యాయము ఆ పాత్ర ఎవరైనా సంపూర్ణంగా త్రాగాలని డిమాండ్ చేస్తుంది. ఆ పాత్రలోనికి చూచినప్పుడు, మానవ పాపము ఆయనకు తెలుసు, పాపము మీద పరిశుద్ధుని ఉగ్రత పాత్రలోనిది ఆయన త్రాగినప్పుడు పరమందున్న తన తండ్రి యొద్దనుండి ఆయన వేరుచేయబడతాడన్న సంగతియు ఆయన ఎరుగును! తన తండ్రి వద్దనుండి వేరైన ఒక్క క్షణంకూడా ప్రభువైన యేసు ఎరుగడు. పరలోకమందున్న తండ్రి సముఖాన్ని వదలి ప్రభువు భూలోకానికి వచ్చినా, పరిపూర్ణమైన సహవాసాన్ని ఆయన ఆత్మయందు అనుభవిస్తూనే ఉన్నాడు. ఆయన సిలువమీదికి ఎత్తబడినప్పుడు, పరిపూర్ణమైన సహవాసము తండ్రితో తనకు కలిగియున్న ఏకత్వము విడిపోతుందన్న విషయం ప్రభువుకు బాగా తెలుసు. తన పరిశుద్ధమైన సంపూర్ణ వ్యక్తిత్వమంతటిలో ఆ గడియను బట్టి ఆయన భయపడుతున్నాడు! ఆ భయంకరమైన ఘడియను ఎదురుచూచే, సాధ్యమైతే ఈ గిన్నె నా వద్దనుండి తొలగించుమని ఆయన తన తండ్రితో విన్నవించుకొంటున్నాడు. "ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన

చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను" (లూకా 22:44). దానికి పరలోకం నుండి వచ్చిన జవాబు మౌనం. ఆ పాత్రను తొలగించ డంలో ప్రభువైన యేసు యొక్క విన్నపానికి తండ్రి ఎన్నడే బదులివ్వలేదు.

ఆ తోటలోని ఏకాంతపు విషాదకరమైన గడియలో, తన నిమిత్తము తన శిష్యులు సహా ప్రార్థించి విజ్ఞాపనము చేయవలసిందిగా ప్రభువు వారిని కోరాడు, కాని ఆయన శిష్యులు నిద్రపోయే స్థితిలోనే ఉన్నారు. ముమ్మారు ప్రభువు ప్రార్థించాడు, ఆ మూడు సార్లు కూడా ఆయన శిష్యులు నిద్రావస్థలోనే మిగిలిపోయారు, మరియు తండ్రి ఆయన ప్రార్థనకు ప్రత్యుత్తరం యివ్వలేదు. అపవాది తన పాతాళ సంబంధమైన శక్తులన్నిటిని ఆయన మీద కేంద్రీకృతం చేసియుండగా, ఏకాకిగా ప్రభువు తన తండ్రికి విన్నపం చేసికొన్న రాత్రి, అది పోరుయొక్క ఉద్రిక్తత బహు ఎక్కువగా ఉన్న రాత్రిని ఏ మానవుడు ఊహించ లేదు. ఆయన పరిచర్య యొక్క ఆరంభమందు, అపవాది ప్రభువునకు ఈ లోక రాజ్యములన్నియు యిస్తానని చెప్పినప్పుడు, వాడు కోరినట్లు ఆయన వానికి మ్రొక్కి యుండియున్నట్టయితే, ఆయన యొక్క ఈ చివరి గడియలలో వాడు ఏమి చేసియుండేవాడో ఊహించగలవా? ప్రభువైన యేసు యొక్క పెదవులనుంచి మారుమ్రోగిన విలాపము, మరియు విన్నపము ఆయన శిష్యుల చెవులలో పడలేదు సరిగదా, పరలోకమునుండి సహా చల్లని నిశబ్దంతో నిలిచిపోయాయి. ఏది యెలాగున్నా, సిలువను సహించగలుగునట్లు ప్రభువుకు తండ్రి భౌతికంగా బలమిచ్చాడు.

## ముగింపు

ఆయన జీవితంలో ఈ ఘోర విపత్తు పైబడక ముందు ఈ తోటయందు గంటల తరబడి ప్రభువు ప్రార్థించకుండ ఉండినట్లయితే ఏమి జరిగేది? నేటి అనేకమంది క్రైస్తవులవలె, తమ పరలోకపు తండ్రికి బహు అల్పమైన ప్రార్థన చేసి ఆయనతో అత్యల్పమైన సహవాసము కలిగి మరియు క్రీస్తునందలి తమ సహోదరులతోను అలాటి సహవాసమే కలిగి ఉండి ఆయన జీవించినట్లయితే ఎలా ఉండియుండేది? అలాటి ప్రశ్నలకు జవాబును మనం ఊహించగలం తండ్రి చిత్తాన్ని జరిగించడానికి మరియు ఆయన ఉగ్రత పాత్రను సంపూర్తిగా త్రాగడానికి కావలసిన శక్తి ప్రభువు ఎన్నడును కనుగొనగలిగే వాడుకాడు! ప్రభువు ఆ తోటలో తండ్రితో అనేక గంటలు సన్నిహితంగా గడిపినందుకును, "లెండి వెళ్లుదము; ఇదిగో నన్ను అప్పగించువాడు సమీపించియున్నాడని" ధైర్యముగా చెప్పగలిగి నందుకును మనము దేవుని స్తుతించ బద్ధులమైయున్నాం (మత్తయి 26:46).

కోట్లకొలదిమంది ఈ భూమిమీద నివసిస్తారు, కాని కొన్ని యుద్ధాలను ఒంట రిగానే ఎదుర్కోవలసి యుంటుంది. మన కొరకు ప్రార్థించుడనియు, క్రీస్తునందున్న మన సహోదరులను మనతో నిలిచియుండమనియు మనం అడుగవచ్చు, కాని ఈ యుద్ధాలలో పోరాడడానికిగాని, విజయం సాధించడానికిగాని అవసరమైన బలము దేవునినుండి వస్తుంది.

క్రైస్తవులకు, సాతానుపై విజయం సాధించడానికి కీలకము తండ్రితో ఒంటరిగా

మోకాళ్లమీద, సంపూర్తిగా ఆయన చిత్తం జరిగించడానికి లోబడి యుండడమే. జయశాలిగా ప్రభువు ఆ తోటలోనుండి బయలుదేరి వెళ్లాడు! సిలువయొక్క బాధను, వేదనను ఆయన యింకను అనుభవించవలసియుంది, కాని ఆయన జయించినవాడే – ఎందుకంటే తన చిత్తాన్ని సంపూర్ణంగా తన తండ్రి చిత్తానికి లోబరచుకున్నాడు. మనం సంపూర్తిగా ఆయన చిత్తానికి లోబడినప్పుడు, తన నిర్ణయం యొక్క ఫలితాలను సర్వజ్ఞుడు, సర్వశక్తుడు, సంపూర్ణ ప్రేమామయుడు, మనకు ఏది శ్రేష్ఠమైనదో దానిని పూర్ణంగా ఎరుగగలిగిన దేవుని చేతికి అప్పగిస్తున్నాం. “దేవుని ప్రేమించువారికి, అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి, మేలుకలుగుటకై సమస్తమును సమకూడి జరుగుచున్నవని యెరుగుదుము” (రోమా 8:28).

ఒక్కొక్కరంగా ఒకనాడు మనం దేవుని యెదుట నిలువవలసి వస్తుంది, ఆయన చిత్తానికి సంపూర్ణంగా లోబడి, గంటల తరబడి ఆయన సన్నిధిలో ప్రార్థించుచు సన్నిహిత మైన బాంధవ్యాన్ని పెంచుకొని ఆయన చిత్తాన్ని జరిగించే వారముగానైనా ఆయన సముఖమందు నిలవాలి, లేదా పరాయివారుగా నిలబడి, “నేను మిమ్మును ఎన్నడును ఎరుగను అక్రమము చేయువారలారా, నా యొద్దనుండి పొండి” అనే భయంకరమైన వినాశనకరమైన మాటలు వినవలసివస్తుందో (మత్తయి 7:23). మనం దేవునితో నిత్యత్వం కోరుకున్నట్టయితే, ఆయనకు మనం లోబడినవారమై ఆయన ఎదుట ప్రార్థనలో యిప్పుడు మనం గడపవలసి ఉంటుంది.

---

సూచన

[1]Eleanor Allen Schroll, “There’s a Garden” (“The Garden of Prayer”). This quotation is used by permission of ACU Press.